క్లుప్తంగా

డిప్యూటీ ఈఓ తనిఖీ

సంగం: మండలంలోని గాంధీజనసంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆత్మకూరు డిప్యూటీ ఈఓ గోపాల్ శనివారం తనిఖీ చేశారు. తొలుత పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున రెడ్డి, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

కుష్టుపై అవగాహన

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరు ఉన్నత పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు కుష్టు వ్యాధిపై పారామెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోహన్‌రావు శనివారం అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటే వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుష్టు అంటువ్యాధి కాదని, ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స పొందితే నయమవుతుందని తెలిపారు. ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లురెడ్డి, ఆరోగ్యసిబ్బంది సుబ్బమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు



ఆత్మకూరు: పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీ గంగాధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ బాలికల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు శనివారం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ నెల 31న పోలీసు సంస్మరణ దినోత్సవం నాడు విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని సీఐ తెలిపారు. ఎస్సై షేక్ జిలానీ, హెచ్‌ఎంలు కోటేశ్వరమ్మ, అనంత లక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్



కావలి: కావలి కోర్టు ప్రాంగణంలో శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కోర్టు పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జీ విక్రమ్‌సింహ, స్పెషల్ మేజిస్ట్రేట్ పీ పరుసురాం, లీగల్‌ఎయిడ్ మెంబర్ ఐ సాయి ప్రసాద్, లోక్‌అదాలత్ మెంబర్ మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పీసీబీ డిజైన్ వర్క్‌షాప్



కావలి: వర్క్‌షాప్‌లతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని తిరుపతికి చెందిన పద్మావతి ఐటీ సొల్యూషన్స్ ప్రతినిధి పీ యోగానంద్ అన్నారు. కావలిలో డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో పీసీబీ డిజైన్‌పై రెండ్రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో మొబైల్స్, టీవీ, తదితర ఎలక్ట్రానిక్ వస్తువుల్లో వినియోగించే ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి అవసరమైన శిక్షణలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ టీవీరావు, ఏఓ జీ రమేష్‌బాబు, కే వేణుగోపాల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ



ఆత్మకూరు: స్థానిక వెస్ట్ ప్రాథమిక పాఠశాలలో డిస్లెక్సియాపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సీతాదేవి మాట్లాడుతూ అభ్యసనా వైకల్యం కలిగిన పిల్లలు చదవడం, రాయడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అర్థం చేసుకుని సమస్యలను అధిగమించేలా ప్రోత్సహించాలని కోరారు. ఉపాధ్యాయులు మంజులవాణి, ధనమ్మ, శశికళ, ఆర్పీలు పద్మ, జయకుమార్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం

ఆత్మకూరురూరల్: సాతానుపల్లిలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు విగ్రహ ప్రతిష్టాచార్యులు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, విశేష హోమాలు, జలాదివాసం నిర్వహించారు. శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

- భారీగా కురుస్తున్న వర్షాలు
- ప్రమాదపు అంచున సాగునీటి చెరువులు
- మంజూరు కాని అభివృద్ధి నిధులు
- సత్వరమే కట్టలకు మరమ్మతులు అవసరమంటున్న రైతులు

మేల్కోకపోతే ముప్పే



కొండాపురం: గండికట్ల చెరువుకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు (ఇన్‌సెట్లో) గండిని ప్రొక్లయిన్ సాయంతో పూడ్చుతున్న దృశ్యం

ఉదయగిరి: జిల్లాలో సాగునీటిపరంగా అత్యంత వెనుకబడిన ప్రాంతం ఉదయగిరి నియోజకవర్గం. ఈ ప్రాంతంలోని జలదంకి, కలిగిరి ,కొండాపురం మండలాల్లోని కొన్ని చెరువులకు సోమశిల జలాలు వస్తున్నా..మిగిలిన చెరువులకు వర్షపు నీరే ఆధారం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున బలహీనంగా ఉన్న చెరువుల కట్టలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రతి నీటి బొట్టును ఒడిసి పడితేనే పంటలు పండే అవకాశం ఉంటుందన్నది రైతులు ఆకాంక్ష. భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఉదయగిరి నియోజకవర్గంలోని చెరువుల పరిస్థితిపై కథనం. ఉదయగిరి నియోజకవర్గంలో ఇరిగేషన్ పరంగా ఉదయగిరి, వింజమూరు, కావలి-2 సబ్‌డివిజన్లు ఉన్నాయి. వింజమూరు పరిధిలోని కొండాపురం, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు మండలాల్లో 135 చెరువులు ఉన్నాయి. వాటి పరిధిలో 19,659 ఎకరాల ఆయుకట్టు ఉంది. ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి మండలాల్లో 65 చెరువులు ఉన్నాయి. వాటి పరిధిలో 2,819 ఎకరాల ఆయుకట్టు ఉంది. అలాగే గండిపాళెం జలాశయం పరిధిలో మరో 16వేల ఎకరాల ఆయుకట్టు కూడా ఉంది. ఈ నీటి వనరులు 80 శాతం మేర వర్షం మీద ఆధారపడి ఉంటాయి. చెరువులు నిండితేనే భూములు సాగులోకి వస్తాయి. ఉదయగిరి మెట్ట ప్రాంతంలో వర్షపాతం చాలా తక్కువగా ఉంటుంది. తుపాన్లు, వాయుగుండాలు, అల్పపీడనాలు దక్షిణ కోస్తా ప్రాంతంపై ప్రభావం చూపి వర్షాలు పడినప్పుడే చెరువుల్లో నీరు చేరుతోంది. అందుకే పాలకులు కూడా చెరువుల అభివృద్ధిపై పెద్దగా దృష్టి సారించరు. వర్షాలు పడినప్పుడు మాత్రమే తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తారే తప్ప శాశ్వత పనులపై శ్రద్ధ పెట్టరు. ఈ నేపథ్యంలో చాలా చెరువుల కట్టలు బీటలు వారి వర్షపు నీరు చేరినప్పుడు తెగిపోతుంటాయి.

ప్రస్తుతం చెరువుల్లో నీటి పరిస్థితి

వింజమూరు సబ్ డివిజన్ పరిధిలో 135 చెరువులు ఉండగా, 77 చెరువుల్లో 25 శాతంలోపు నీరు చేరింది. మరో 37 చెరువుల్లో 50 శాతం లోపు నీరు ఉంది. 15 చెరువుల్లో మాత్రం 75 శాతం మేర నీరు చేరింది. మరో ఆరు చెరువులు నిండే స్థితిలో ఉన్నాయి. ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని 65 చెరువులు ఉండగా, 30 చెరువుల్లో 50 శాతం మేర నీరు చేరింది. మరో 34 చెరువుల్లో 25 శాతంలోపు నీరు ఉంది. ఉదయగిరి కొత్త చెరువులో మాత్రం 90 శాతం నీరు చేరింది. కలిగిరి, జలదంకి మండలాల్లోని 76 చెరువుల్లో కూడా కొంతమేర నీరు చేరింది. వర్షాలు ఇంకా కురిసే అవకాశం ఉన్నందున చెరువులు నిండే పరిస్థితి ఉంది. అందువల్ల చెరువు కట్టలపై అధికారులు దృష్టి సారించి పటిష్టానికి ముందుస్తు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బలహీనంగా చెరువుల కట్టలు..ఆందోళనలో రైతులు

ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలో కట్టలు బలహీనంగా ఉన్న 25 చెరువుల అభివృద్ధికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వింజమూరు సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న మరో 40 చెరువుల అభివృద్ధికి సైతం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. కానీ నిధులు మంజూరు కాలేదు. గండిపాళెం జలాశయం పరిధిలోని కాలువల్లో చెట్ల తొలగింపు, పూడికతీతకు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కట్టలు తెగిపోతున్నాయి. శనివారం కురిసిన వర్షాలకు కొండాపురం మండలం కొమ్మి చెరువుకు గండి పడింది. ఉదయగిరిలో కొత్త చెరువు నిండడంతో కట్ట దెబ్బతింది. అయితే అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టడం ప్రమాదం తప్పింది. ప్రస్తుతానికి చెరువుల్లో నీరు తక్కువగా ఉన్నందున ప్రమాదం లేదు. కానీ చెరువులు నిండితే తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

నిధులు మంజూరు చేయాలి



చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున నీరు చేరి బలహీనంగా ఉన్న కట్టలు తెగిపోతున్నాయి. సాగునీరు వృథాగా పోతే పంటలు పండే పరిస్థితి ఉండదు. రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. కావున వెంటనే మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలి.

– బీ సుబ్బానాయుడు, కొమ్మి ,రైతు

ప్రతిపాదనలు పంపాం



బలహీనంగా ఉన్న చెరువు కట్టల అభివృద్ధికి నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేస్తాం. ప్రమాదకరంగా ఉన్న చెరువులను గుర్తించి తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నాం. రైతులు అప్రమత్తంగా ఉండి సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

–టీ రమణారావు, ఇరిగేషన్ డీఈ, వింజమూరు

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

- కావలి ఆర్డీఓ ఎం వంశీకృష్ణ



మాట్లాడుతున్న ఆర్డీఓ వంశీకృష్ణ

కావలి: కావలి డివిజన్ పరిధిలో భూముల రీసర్వే చేపట్టిన గ్రామాల్లో వచ్చే నెల 14వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ ఎం వంశీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన కావలిలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూసమస్యలపై అర్జీలు స్వీకరించి పది రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు.

కావలి నియోజకవర్గంలో..

కావలి మండలంలో 23న కొత్తపల్లి, 26న ఆనెమడుగు, అల్లూరు మండలంలో 22న ఇందుపూరు, 24న గ్రద్దగుంట, 26న బట్రకాగొల్లు, 29న నార్త్‌మోపూరు, వచ్చే నెల 2న వెలిచర్ల, 5న నార్త్‌ఆములూరు, 7న బీరంగుంట, ఏబీకండ్రిగ, కేబీకండ్రిగ, 12న ఇస్కపల్లి, 14న గోగులపల్లి, దగదర్తి మండలంలో 22న యలమంచిపాడు, 24న కామినేనిపాళెం, 26న అనంతవరం, 29న లింగాలపాడు, వచ్చే నెల 5న ఊచగుంటపాళెం, 7న తురిమెర్ల, 9న ఐతంపాడు, 10న దామరవం, బోగోలు మండలంలో ఈ నెల 23న ముంగమూరు, 25న ఎస్వీపాళెం, 29న జక్కేపల్లిగూడూరు, వచ్చే నెల 5న ఉమామహేశ్వరపురం, 7న తాళ్లూరు, 8న మల్లాయపాళెం గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని ఆర్డీఓ తెలిపారు.

ఉదయగిరి నియోజకవర్గంలో..

జలదంకి మండలంలో 22న కోదండరామపురం, 26న కేశవరం, వింజమూరు మండలంలో 22న నందిగుంట, 24న నల్లగొండ, 26న తమిదపాడు, 29న జనార్దనాపురం, వచ్చే నెల 5న ఏ కిస్తీపురం, కలిగిరి మండలంలో 22న రావులకొల్లు, 24న పరికోట, 29న లక్ష్మీపురం, వచ్చే నెల 5న సిద్ధనకొండూరు, 6న కుమ్మరకొండూరు, 12న దూబగుంట గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని వివరించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

బిట్రగుంట: భూసమస్యలు, రీసర్వేలో దొర్లిన తప్పుల సవరణకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సురేష్ కోరారు. బోగోలు మండలం సాంబశివపురంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలు, చుక్కల భూములు, నోషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మార్చడం, ఖాతా నంబర్లకు ఆధార్ నంబర్ లింక్ చేయడం, రీసర్వేలో దొర్లిన తప్పుల సవరణకు రైతులు అర్జీలు అందజేస్తే పదిహేను రోజుల్లోగా పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరు: మండలంలోని పురిణిలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వేలో దొర్లిన తప్పులు, భూసమస్యలను రైతులు తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. రీసర్వే డీటీ, ఆర్ఐ పాల్గొన్నారు.

దుత్తలూరు: మండలంలోని బ్రహ్మేశ్వరంలో తహసీల్దార్ వై నాగరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వేలో దొర్లిన తప్పుల సవరణ, భూసమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం అగ్రహారంలో సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన తహసీల్దార్ వీరవసంతరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వేకు సంబంధించిన సమస్యలపై గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు. వీఆర్వోలు ప్రభాకర్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని నువ్వూరుపాడులో సర్పంచ్ కటారి దొరసానమ్మ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ సుధీర్ పాల్గొని రీసర్వేకు సంబంధించిన సమస్యలపై అర్జీలు స్వీకరించారు. డీటీ శాంతిస్వరూప్, సర్వేయర్ రాజా, వీఆర్వో ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్: నువ్వూరుపాడులో రికార్డులను చదివి వినిపిస్తున్న అధికారులు



అల్లూరు మండలం పురిణిలో..

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



ఆత్మకూరులో విద్యార్థుల మానవహారం



కావలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కావలి: మానవ అక్రమ రవాణాను గుర్తించి అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కావలి డీఎస్పీ శ్రీధర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీని శనివారం నిర్వహించారు. పాతూరులోని మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ ర్యాలీలో డీఎస్పీ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, బాలికలు, మహిళల అక్రమ రవాణా వారి జీవితాలను నాశనం చేస్తుందన్నారు. మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండి తమను తాము రక్షించుకోవాలన్నారు. ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు షేక్ ఖాదర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: అంతర్జాతీయ మహిళా అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో వాక్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీని శనివారం నిర్వహించారు. ముంబైకు చెందిన ది మూమెంట్ ఆఫ్ ఇండియా, మదనపల్లికి చెందిన గ్రామజ్యోతి సొసైటీ, ఆత్మకూరుకు చెందిన క్రైడ్ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ ర్యాలీని ఆత్మకూరు సీఐ జీ గంగాధర్ ప్రారంభించి మాట్లాడారు. ఉమెన్ ట్రాఫికింగ్‌కు గురైన వారు హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181ను సంప్రదించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, క్రైడ్ సంస్థ నిర్వాహకులు వాగాల శ్రీహరి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతను పాటించాలి

ఆత్మకూరు: ఆటోలు, వ్యాన్ల డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు విధిగా పాటించాలని ఆత్మకూరు సీఐ జీ గంగాధర్ అన్నారు. ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఆటో, వ్యాన్ల డ్రైవర్లకు ఎస్సై షేక్ జిలానీతో కలిసి సీఐ శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. వాహన, డ్రైవింగ్ లైసెన్స్‌లను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. లైసెన్స్‌లు లేని వారికి రవాణా శాఖ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రబీ సాగులో రైతులకు అండగా ఉండాలి



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీమాధవి

ఆత్మకూరురూరల్: రబీ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకులు అండగా ఉండాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ ముఖ్యఅతిథిగా హాజరై విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కేవీకేకు చెందిన విజయ్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ రబీ సాగులో సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఆత్మకూరు ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, సబ్సిడీ విత్తనాలు, కౌలు కార్డుల పంపిణీ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆత్మకూరు, అనంతసాగరం, అనుమసముద్రంపేట మండలాల ఏఓలు కిషోర్ బాబు, శ్రీధర్‌రెడ్డి, రజని, జిల్లా వనరుల కేంద్రం ఏఓ శ్రీనివాస చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల ఫిర్యాదుపై విచారణ

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ ఈఓ అబ్దుల్ జహీర్ రాజకీయ దురుద్దేశంతో తమపై తప్పుడు కేసు పెట్టడాన్ని సవాల్ చేస్తూ వార్డు సభ్యులు సూరపనేని శ్రీనివాసులు, సన్నమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు శనివారం విచారణ చేపట్టారు. వార్డు సభ్యుల విజ్ఞప్తి మేరకు కలెక్టర్ బహిరంగ విచారణకు ఆదేశించడంతో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఈఓపీఆర్డీ నయీం పంచాయతీ కార్యాలయంలో బహిరంగ విచారణ చేపట్టారు. ఈఓ, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యుల సమక్షంలో జరిగిన ఘటనపై విచారణ నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. వార్డు సభ్యులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన పంచాయతీ సాధారణ సమావేశం సందర్భంగా కార్యాలయంలో మాజీ సీఎంలు వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటాల తొలగింపుపై ఈఓను ప్రశ్నించడం జరిగిందన్నారు. అందుకు తాను ఇటీవలే వచ్చానని, చిత్రపటాల తొలగింపు విషయం తనకు తెలియదని ఈఓ బదులిచ్చారన్నారు. అనంతరం ఈఓ పంచాయతీ సిబ్బందిని ప్రశ్నించగా ఎన్నికల కోడ్ కారణంగా తొలగించినట్లు అందరి ముందు బదులిచ్చారని తెలిపారు. కోడ్ ముగిసినందున మాజీ సీఎంల చిత్రపటాలను కార్యాలయంలో పెట్టమని స్వయంగా ఈఓనే సిబ్బందికి సూచించారని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎటువంటి వాదోపవాదాలు జరగలేదన్నారు. ఆ తరువాత సమావేశం కూడా ప్రశాంతంగా ముగిసిందన్నారు. సమావేశానంతరం ఈఓ ఉద్దేశపూర్వకంగా తన విధులకు ఆటంకం కలిగించారంటూ వార్డు సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశారని లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. ఈ మేరకు వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, ఈఓ వాంగ్మూలాలను నమోదు చేసి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

జమిలి ఎన్నికల విధానాన్ని వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న మూలం సురేష్

సోమశిల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జమిలి ఎన్నికలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుందని, దీనివల్ల రాష్ట్రాలు స్వయంప్రతిపత్తిని కోల్పోయే ప్రమాదం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. అనంతసాగరం మండల ఆమనిచిరువెళ్ల గ్రామంలో శనివారం నిర్వహించిన సీపీఎం మండల మూడో మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తమ పార్టీ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ఉత్తరాన బీజేపీ బలహీనపడుతోందన్నారు. అందుకే దక్షిణాన బలం పెంచుకునే ప్రయత్నాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను వాడుకుంటోందన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గసభ్యుడు మూలి వెంగయ్య, జిల్లా కమిటీ సభ్యుడు మంగళ పుల్లయ్య మాట్లాడారు. మండల కార్యదర్శిగా అన్వర్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత జిల్లా కమిటీ సభ్యుడు గంటా లక్ష్మీపతి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి మూలం రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లైసెన్సులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు

అల్లూరు: లైసెన్సులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ నాగరాజు హెచ్చరించారు. శనివారం ఆయన విత్తనాల వద్ద బస్తాల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను గమనించి నిలిపి అడగగా నార్తుమోపూరు నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లుగా తెలిపారు. దీంతో అమ్మకందారుడి గోదాము వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ భారీగా విత్తనాల వడ్లు అమ్మకానికి సిద్ధంగా ఉండడాన్ని గమనించి గోదాముకు తాళం వేశారు. అనుమతి పత్రాలను తీసుకురావాలని సూచించారు.శుక్రవారం విజిలెన్స్ ఎస్పీ తనిఖీల్లో భాగంగా మూడు ప్రాసెసింగ్ యూనిట్లను పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. లైసెన్సులు లేకుండా విత్తనాల వడ్లను విక్రయిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

ఉదయగిరిలో భారీ వర్షం



దుత్తలూరు మండలం ఏరుకొల్లు వద్ద వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు



కావలిలో వర్షం



వింజమూరు మండలం తక్కెల్లపాడులో ఓ ఇంట్లో చేరిన వర్షపునీరు



జలకళను సంతరించుకున్న గండిపాళెం జలాశయం

ఉదయగిరి: ఉదయగిరిలో శనివారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పట్టణంలోని డ్రైనేజీలు పొంగి ప్రవహించడంతో వీధులు జలమయమయ్యాయి. పంచాయతీ బస్టాండ్ వర్షపునీటితో చెరువులా మారింది. మండలంలోని పుల్లాయపల్లి వద్ద ఉన్న దున్నపోతుల వాగు పొంగడంతో కొండకింద ఉన్న పల్లెలకు రాకపోకలు నిలిచిపోయాయి. దాసరిపల్లి పెద్దచెరువు కాలువకు గండి పడడంతో వర్షపు నీరు నివాసాల్లో చేరింది. మాజీ సర్పంచ్ సయ్యద్ జమృత్ జాఫర్‌మొయిద్దీన్ జేసీబీతో గండిని పూడ్చడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా గండిపాళెం ప్రాజెక్ట్‌లోకి నాలుగు అడుగుల మేర నీరు చేరింది. దీంతో డెడ్ స్టోరేజీని అధిగమించింది. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 31 అడుగులు కాగా ప్రస్తుతం 8 అడుగుల మేర నీరు నిల్వ ఉంది.

దుత్తలూరు: మండలంలో శనివారం ఉదయం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ముత్తరాచుపల్లి వద్ద గూబలవాగు చప్టాపై ప్రవహించడంతో కొంత సమయం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏరుకొల్లు వద్ద వాగు ప్రవహించడంతో కొద్దిసేపు రాకపోకలకు ఇబ్బంది కలిగింది. దుత్తలూరు బీసీ కాలనీలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. గూబల వాగు, ఏరుకొల్లు వాగు, బీసీ కాలనీలను తహసీల్దార్ వై నాగరాజు పరిశీలించారు. ఎస్సై ఆదిలక్ష్మి ముత్తరాచుపల్లి వద్ద వాగును పరిశీలించారు.

కలిగిరిలో ఓ మోస్తరు వర్షం

కలిగిరి: మండలంలో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటికే వాయుగుండం ప్రభావంతో మూడ్రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు చెరువుల్లోకి 50 నుంచి 75 శాతం మేర నీరు చేరింది. మరి కొద్దిరోజులు వర్షాలు పడితే చెరువులు పూర్తిస్థాయిలో నీరు చేరే అవకాశం ఉంది. వర్షాలు తగ్గుముఖం పడితే పొగాకు, మినుము పంటలను సాగు చేయడానికి రైతులు సన్నాహాలు చేస్తున్నారు.

చేజర్ల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం పడింది. ఉదయం చేజర్ల, పెరుమాళ్లపాడు, మాముడూరు, టీకేపాడు, ఆదూరుపల్లి, కోటితీర్థం, తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మండలంలో కొన్ని గ్రామాల్లో వరి పంట కోత దశలో ఉంది. వర్షంతో పంటకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కావలి: పట్టణంలోని శనివారం ఉదయం వర్షం కురిసింది. వాయుగుండం ప్రభావంతో మూడ్రోజుల పాటు కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించింది. రెండ్రోజుల పాటు తెరిపిచ్చిన వర్షం మళ్లీ పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా రోడ్డు మార్జిన్ చిరువ్యాపారాలు వ్యాపారాలు లేక ఆవేదన చెందుతున్నారు.

గండికట్ల చెరువుకు గండి


కొండాపురం: మండలంలోని కొమ్మి పంచాయతీ పరిధిలోని గండికట్ల చెరువుకు శనివారం ఉదయం 8 గంటల సమయంలో గండి పండింది. చెరువు కట్ట అడుగు భాగంలో భారీ రంధ్రం ఏర్పడి నీరు వృథాగా పోతున్న విషయాన్ని గమనించిన రైతులు అప్రమత్తమయ్యారు. విషయం తెలుసుకున్న కొండాపురం ఎస్సై వెంకట్రావు తన సిబ్బందితో హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకున్నారు. జోరువానలోనే అలుగు దాటుకుని వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. గ్రామస్తులతో కలిసి మధ్యాహ్నం 3 గంటల వరకు రంధ్రాన్ని పూడ్చేందుకు ప్రయత్నించారు. వారు ఎంత శ్రమించినా ఫలితం లేకుండా పోయింది. పరిస్థితిని గమనించిన ఇరిగేషన్ ఏఈ రమేష్ వెంటనే కావలికి వెళ్లి ప్రొక్లయినర్‌ను తీసుకొచ్చి రంధ్రాన్ని పూడ్చి వేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

జలపాతాల కనువిందు

ఉదయగిరి: ఉదయగిరిలో శనివారం కురిసిన భారీ వర్షానికి దుర్గం కొండపై నుంచి జలపాతాలు జాలువారుతూ ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేశాయి. గత కొన్నేళ్లుగా వర్షాలు తగ్గిపోవడంతో జలపాతాలు కనిపించడంలేదు. నాలుగేళ్ల క్రితం భారీ వర్షాలు పడగా దుర్గం కొండపై జలపాతాలు పట్టణవాసులను కనువిందు చేశాయి.మళ్లీ ఇప్పుడు కనులవిందుగా జలపాతాలు దర్శనమిచ్చాయి. దీంతో పట్టణ ప్రజలు దుర్గం వద్దకు చేరుకుని జలపాతాలను ఆస్వాదించారు.



జలపాతాలను ఆస్వాదిస్తున్న పట్టణ ప్రజలు



దుర్గం కొండపై నుంచి జాలువారుతున్న జలపాతాలు



చేజర్ల: ఆదూరుపల్లిలో వర్షం



ఉదయగిరి: జలమయమైన వింజమూరు బీసీ కాలనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్